

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రూ.3,662.17 కోట్ల విలువైన డివిడెండ్ చెక్కును అందజేస్తున్న ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతి

# రికార్డు స్థాయికి సూచీలు

## 82,134కి సెన్సెక్స్, 25,151 పాయింట్లకు నిఫ్టీ




ముంబై, ఆగస్టు 29: దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. బ్లూచిప్ సంస్థల ర్యాలీతో సూచీలు మరో శిఖరానికి చేరుకున్నాయి. గత పదిరోజులుగా పెరుగుతూ వచ్చిన సూచీలు గురువారం మరో రికార్డు స్థాయిలో ముగిశాయి. అన్ని రంగాల షేర్లలో క్రయ విక్రయాలు జోరుగా సాగడం, అంతర్జాతీయ పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడంతో ఇంట్రాడేలో ఆల్‌టైం హైకి చేరుకున్న సూచీలు చివర్లో ఇదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల స్థాయిలో పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 349.05 పాయింట్లు అందుకొని 82,134.61 వద్ద ముగిసింది. సూచీలకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం. గత ఎనిమిది సెషన్లలో సెన్సెక్స్ 1,709.93 పాయింట్లు లేదా 2.12 శాతం లాభపడింది. మరో సూచీ నిఫ్టీ 25 వేల పాయింట్ల పైన ముగిసింది. ఒక దశలో 140 పాయింట్లు లాభపడిన నిఫ్టీ చివరకు 99.60 పాయింట్లు అందుకొని 25,151.96 వద్ద స్థిరపడింది. గత 11 సెషన్లలో నిఫ్టీ 1,012.95 పాయింట్లు లేదా 4.19 శాతం లాభపడింది. మార్కెట్లో టాటా మోటర్స్ అత్యధికంగా నాలుగు శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, టెక్ మహీంద్రా, మారుతి, ఎస్బీఐలు లాభాల్లో ముగిశాయి. బోనస్ షేరును ప్రకటించడంతో రిలయన్స్ షేరు ఏకంగా 1.50 శాతం లాభపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.30,389.92 కోట్లు పెరిగి రూ.20,57,382.97 కోట్లకు చేరుకున్నది. కానీ, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్ ఫార్మా, జేఎస్ డబ్ల్యూ స్టీల్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్‌లు నష్టపోయాయి.

## నిర్మాణ రంగంలోకి ఎంఎస్ఎన్ గ్రూపు




కొండాపూర్, ఆగస్టు 29 : ఫార్మా దిగ్గజాల్లో ఒకటైన ఎంఎస్ఎన్ గ్రూపు తాజాగా రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టింది. ఎంఎస్ఎన్ రియల్టీని స్థాపించింది. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ గ్రూపు ఫౌండర్, సీఎండీ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. నిర్మాణరంగంలో తమకంటూ ప్రత్యేకతను చాటడానికి ఈ రంగంలోకి అడుగుపెట్టినట్లు, ముఖ్యంగా వినియోగదారులకు నాణ్యత ప్రమాణాలతో సకల సౌకర్యవంతమైన గృహాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌లో ఎంఎస్ఎన్ రియాలిటీ లోగోను ఆయన ఆవిష్కరించారు. ఫార్మా రంగంలో ఎంతో కాలంగా సుదీర్ఘ సేవలనందిస్తున్న ఎంఎస్ఎన్ గ్రూపు.. రియల్ ఎస్టేట్ రంగంలోనూ ప్రత్యేక ముద్రను వేసేలా సేవలను అందించనున్నట్లు తెలిపారు. రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలను వినియోగదారులకు అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, వచ్చే రెండు నెలలో ప్రభుత్వ అనుమతులతో హైదరాబాద్‌లో తమ మొదటి ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# 100జీబీదాకా ఉచిత స్టోరేజీ

**రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ**

- వినియోగదారులకు జియో ఏఐ, క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్
- దీపావళి నుంచి అందుబాటులోకి..
- చౌక ధరలకు డాటా-పవర్డ్ ఏఐ సర్వీసులు

ముంబై, ఆగస్టు 29: జియో వినియోగదారులకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఏఐ క్లౌడ్ వెల్‌కమ్ ఆఫర్‌ను ప్రకటించారు. ఇందులోభాగంగా జియో యూజర్లు 100జీబీదాకా ఉచిత క్లౌడ్ స్టోరేజీని పొందే అవకాశాన్ని కల్పించారు. దీంతో జియో కస్టమర్లు తమ ఫోటోలను, వీడియోలను, డాక్యుమెంట్లను, డిజిటల్ కంటెంట్, ఇతర డాటాను స్వేచ్ఛగా, మరింత భద్రంగా దాచుకునే సౌలభ్యం లభించింది. రాబోయే దీపావళి నుంచి ఈ ఆఫర్ అందుబాటులోకి రానున్నది. దీంతో ఇక చాలా చౌక ధరలకే మార్కెట్‌లో క్లౌడ్ డాటా స్టోరేజీ, డాటా-పవర్డ్ ఏఐ సర్వీసులు అన్నిచోట్ల, అందరికీ దొరుకుతాయని అంబానీ అన్నారు. గురువారం ఇక్కడ జరిగిన కంపెనీ 47వ వార్షిక భాగస్వాముల సమావేశం (ఏజీఎం)లో ఈ మేరకు అన్ని వివరాలందించారు.

### మా సంపదనేం దాచట్లేదు

ఒక్కో మెట్టు ఎక్కుతూ ఈ స్థాయికి వచ్చామని, దీని వెనుక ఎంతో కష్టం దాగి ఉన్నదని ముకేశ్ అంబానీ తమ సంస్థ ఎదుగుదలను వివరించారు. ఏజీఎంలో ఒకింత ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. రిలయన్స్ కింది స్థాయి నుంచి పైకొచ్చిందన్న ఆయన.. తమకు భారీ మూలాలేమీ లేవని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే మా సంపదను దాచుకోవట్లేదని, మరింత సంపదను సృష్టిస్తూ జాతి గర్వించదగ్గ కంపెనీగా రిలయన్స్‌ను తీర్చిదిద్దినట్టు పేర్కొన్నారు. బహుళ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో విస్తరించిన రిలయన్స్.. భారతీయ అత్యంత విలువైన కంపెనీగా నిలిచిన విషయం తెలిసిందే. ఆయిల్ రిఫైనింగ్, ఆయిల్-గ్యాస్ ఉత్పత్తి, పెట్రో కెమికల్స్, టెలికం, రిటైల్, మీడియా ఇలా దాదాపు అన్ని కీలక రంగాల్లో రిలయన్స్ కంపెనీలున్న సంగతీ విదితమే. కాగా, లాభాల కోసమో లేక సంపదను దాచుకోవడానికో తాము వ్యాపార కార్యకలాపాలను చేయడం లేదని ముకేశ్ అంబానీ అన్నారు. జాతి సంపద సృష్టికే పనిచేస్తున్నట్టు తెలిపారు. తర్వాతి తరాలకు రిలయన్స్‌ను గొప్ప సంపదగా అప్పజెప్తామన్నారు. ఉత్పత్తి, సేవల్లో అత్యంత నాణ్యతను పాటిస్తున్నామని, దేశ వినియోగదారుల జీవన ప్రమాణాలను పెంచుతున్నామని వెల్లడించారు.

### భారత్‌కు ఎనర్జీ సెక్యూరిటీ..

భారత్‌కు ఎనర్జీ సెక్యూరిటీని కల్పించే బాధ్యతను రిలయన్స్ తీసుకున్నదని ముకేశ్ అంబానీ అన్నారు. ఈ క్రమంలోనే పునరుత్పాదక శక్తిపై దృష్టి సారించామని, సోలార్ పవర్ విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నామని వివరించారు. '2018 జూలైలో 100 బిలియన్ డాలర్ల విలువను రిలయన్స్ చేరుకున్నది. 2022లో 250 బిలియన్ డాలర్లకు చేరింది. 2027 నాటికి ఇది రెట్టింపవుతుందని నేను వాగ్దానం చేస్తున్నాను. భవిష్యత్తులో లాభాలపరంగా, వృద్ధిపరంగా రిలయన్స్ కొత్త శిఖరాలను అధిరోహించగలదు' అని ముకేశ్ చెప్పారు.

### ప్రపంచంలో జియోనే టాప్

ప్రపంచంలో ఇప్పుడు అతిపెద్ద మొబైల్ డాటా కంపెనీగా జియోనే ఉందని ముకేశ్ తెలియజేశారు. గడిచిన 8 ఏండ్లలో సంస్థ కస్టమర్లు 49 కోట్లకు పెరిగారని, సగటున నెలకు 30జీబీకిపైగా డాటా వాడుతున్నారని చెప్పారు. ఇక ప్రపంచంలో అతిపెద్ద డాటా మార్కెట్‌గా భారతే ఉందన్న ఆయన.. ఇందుకు జియోనే కారణమన్నారు. అంతర్జాతీయ మొబైల్ ట్రాఫిక్‌లో జియో వాటా 8 శాతంగా ఉన్నట్టు వివరించారు. అలాగే 5జీ, 6జీ టెక్నాలజీల్లో జియోకు 350 పేటెంట్లున్నట్టు ఈ సందర్భంగా ముకేశ్ అంబానీ ప్రకటించారు. ఈ క్రమంలోనే ప్రతి నెలా 10 లక్షల బ్రాడ్‌బాండ్ కనెక్షన్లను లక్ష్యంగా చేసుకోబోతున్నట్టు తెలిపారు. అంతేగాక 2 కోట్లకుపైగా చిన్న-మధ్యతరహా వ్యాపారాలను, 15 లక్షల పాఠశాలలు-కళాశాలలను, 70వేలకుపైగా దవాఖానలను, 12 లక్షల డాక్టర్లను బ్రాడ్‌బాండ్‌తో కనెక్ట్ చేసే దిశగా వెళ్తున్నట్టు వెల్లడించారు.

### 1:1 బోనస్ షేర్ల పరిశీలన

తమ ఈక్విటీ షేర్‌హోల్డర్లకు 1:1 శ్రేణిలో బోనస్ షేర్లను ఇవ్వాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ భావిస్తున్నది. ఈ అంశాన్ని సంస్థ బోర్డు సెప్టెంబర్ 5న పరిశీలించనున్నది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలియజేసింది. కాగా, 2017 సెప్టెంబర్‌లో చివరిసారిగా బోనస్ షేర్లను జారీ చేసింది రిలయన్స్. మళ్లీ ఏడేండ్ల తర్వాత బోనస్ షేర్లను సిఫార్సు చేసే దిశగా కంపెనీ వెళ్తుండటం గమనార్హం. 2009లోనూ 1:1 ప్రాతిపదికన వాటాదారులకు బోనస్ షేర్లను రిలయన్స్ ఇండస్ట్రీస్ అందించిన సంగతి విదితమే.




### లగ్జరీ నగల వ్యాపారంలోకి..

వచ్చే 3-4 ఏండ్లలో రిటైల్ వ్యాపారాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్టు రిలయన్స్ ప్రకటించింది. ఇందులో భాగంగానే లగ్జరీ జ్యుయెల్లరీ సెగ్మెంట్‌లోకి అడుగు పెట్టాలని యోచిస్తున్నట్టు రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఇషా అంబానీ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో రిలయన్స్ రిటైల్ రెవిన్యూ రూ.3 లక్షల కోట్ల మార్కును దాటినట్టు చెప్పారు. వచ్చే 4 ఏండ్లలో దీన్ని రూ.6 లక్షల కోట్లకు తీసుకెళ్తామన్న ఆశాభావాన్ని కనబర్చారు. రిటైల్ రంగంలో తమకు 30 కోట్లకుపైగా కస్టమర్లున్నట్టు పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే రిలయన్స్ రిటైల్ విలువ 100 బిలియన్ డాలర్లను దాటిన సంగతి తెలిసిందే.

### ఏజీఎం ముఖ్యాంశాలు

- రిలయన్స్ తమ తొలి సోలార్ గిగా-ఫ్యాక్టరీని ఈ ఏడాదే ఏర్పాటు చేయాలని చూస్తున్నది.
- ఇందులో పీవీ మాడ్యూల్స్, సెల్స్, వేఫర్స్-ఇంగోట్స్, పాలీసిలికాన్, గ్లాస్ తయారు కానున్నాయి.
- ఈ ఏడాదే 20 గిగావాట్స్ సోలార్ పీవీ తొలి రైలు తయారీ మొ దలు.
- 2025కల్లా మెగావాట్ స్థాయిలో సోడియం-ఐయాన్ సెల్ ఉత్పత్తిని పారిశ్రామికీకరణ. 2026లో ఏటా 50 మెగావాట్ లిథియం బ్యాటరీ సెల్స్ పైలట్.
- 2030 నాటికి 100 గిగావాట్ల పునరుత్పాదక శక్తి సామర్థ్యం ఆధారంగా కొత్త ఇంధన వ్యాపారాలను అభివృద్ధి చేసే దిశగా రిలయన్స్. ఇందుకోసం మూడేండ్లపాటు 10 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టాలని 2021 లోనే నిర్ణయించుకున్న సంస్థ.
- రెన్యువబుల్ ఎక్విప్‌మెంట్, బ్యాటరీ స్టోరేజీ, ఫ్యూయల్ సెల్స్, హైడ్రోజన్ తయారీ కోసం గుజరాత్‌లోని జమ్‌నగర్‌లో 4 గిగా ఫ్యాక్టరీల నిర్మాణం.
- జియో క్లౌడ్‌లో ఏ కాల్‌నైనా యూజర్లు రికార్డు చేసుకొని, స్టోర్ చేసుకునేలా జియోఫోన్‌కాల్ ఏఐ సర్వీస్‌ను పరిచయం చేసిన ఆకాశ్ అంబానీ
- జామ్‌నగర్‌లో గిగావాట్ స్థాయిలో ఏఐ-రెడీ డాటా సెంటర్లను ఏర్పాటు చేయనున్న రిలయన్స్.
- భారతీయ వినోద పరిశ్రమలో వాల్ట్ డిస్నీతో రిలయన్స్ డీల్ ఓ నూతన శకానికి నాంది పలికిందన్న ముకేశ్ అంబానీ. ఈ డీల్‌తో రూ.70వేల కోట్ల సంస్థ ఏర్పడుతుండగా.. ఇందులో డిస్నీ హాట్‌స్టార్, జియో సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ వేదికలతోపాటు 120 టెలివిజన్ చానల్స్ ఉంటున్నాయి.

# అంబానీని దాటేసిన అదానీ

- 11.6 లక్షల కోట్ల సంపదతో దేశీయ కుబేరుడు
- హురూన్ ఇండియా జాబితా విడుదల



న్యూఢిల్లీ, ఆగస్టు 29: హిండెన్‌బర్గ్ దెబ్బకు లక్షల కోట్ల సంపదను కోల్పోయిన గౌతమ్ అదానీ మళ్లీ దేశీయ కుబేరుడిగా అవతరించారు. ప్రస్తుత సంవత్సరానికిగాను తన సంపద 95 శాతం పెరిగి రూ.11.6 లక్షల కోట్లతో దేశీయ శ్రీమంతుల జాబితాలో అగ్రస్థానం దక్కించుకున్నారు. ఈ స్థానంలో కొనసాగిన ముకేశ్ అంబానీ రెండో సానానికి పడిపోయినట్టు 2024 సంవత్సరానికిగాను హురూన్ ఇండియా విడుదల చేసిన సంపన్నవర్గాల జాబితాలో పేర్కొంది. గతేడాది కాలంలో ముకేశ్ అంబానీ సంపద 25 శాతం పెరిగి రూ.10.14 లక్షల కోట్లుగా నమోదైంది. 2023లో గౌతమ్ అదానీ సంపద 57 శాతం కరిగిపోయి రూ.4.74 లక్షల కోట్లకు పరిమితంకాగా, ఇదే సమయంలో ముకేశ్ అంబానీ సంపద రూ.8.08 లక్షల కోట్లకు ఎగబాకింది. ఆ తర్వాతి స్థానాల్లో రూ.3.14 లక్షల కోట్లతో హెచ్‌సీఎల్ ఫౌండర్ శివ్ నాడర్ మూడో స్థానంలో నిలువగా, రూ.2.89 లక్షల కోట్లతో సైరస్ పూనావాల నిలిచారు. రూ.2.50 లక్షల కోట్ల సంపదతో దిలీప్ సంఘ్వీ ఐదో స్థానం వరించింది. భారత్‌లో బిలియనీర్ల సంఖ్య నానాటికి పెరుగుతున్నదని తెలిపింది. గతేడాది భారత్‌లో ప్రతి 5 రోజులకొక బిలయనీరు తయారైనట్లు నివేదిక వెల్లడించింది.

- రూ.7,300 కోట్ల సంపదతో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తొలిసారిగా ఈ జాబితాలో చోటు లభించింది.
- అతి పిన్న వయస్సు కలిగిన జెప్టో కో-ఫౌండర్ కైవల్య వొహ్రా తొలిసారిగా చోటు సంపాదించుకున్నారు. రూ.3,600 కోట్ల సంపద కలిగివున్నారు.
- అపర్ణ కన్‌స్ట్రక్షన్ ఫౌండర్ సీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ సుబ్రమణియన్ రెడ్డిల సంపద అత్యధికంగా పెరిగింది.
- పొంగులేటి హర్ష రెడ్డి(కాంగ్రెస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తనయుడు) రూ.1,400 కోట్ల వ్యక్తిగత సంపదతో ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు.
- రూ.1,000 కోట్ల కంటే అధిక ఆస్తి కలిగిన వారు కొత్తగా 220 మంది జతవడంతో మొత్తం సంఖ్య 1,539కి చేరుకున్నారు.

### మూడో స్థానంలో హైదరాబాద్

హైదరాబాద్ మరో ఘనతను సాధించింది. నగరాల వారీగా శ్రీమంతులు జాబితాలో తొలిసారిగా బెంగళూరును అధిగమించి హైదరాబాద్ మూడో స్థానం దక్కించుకున్నది. నగరం నుంచి 104 మంది కుబేరులు ఉన్నట్లు హురూన్ విడుదల చేసిన జాబితాలో వెల్లడించింది. 386 మందితో ముంబై ఎప్పటిలాగే తొలి స్థానంలో నిలువగా, 217 మందితో న్యూఢిల్లీ ఆ తర్వాతి స్థానం వరించింది. హైదరాబాద్‌లో కొత్తగా ఈ ఏడాది 17 మంది శ్రీమంతుల జాబితాలో చేరినట్లు పేర్కొంది. అలాగే బిలియనీర్లు ఉన్న రాష్ర్టాల్లో తెలంగాణ ఐదో స్థానంలో నిలిచింది.

### తెలుగు శ్రీమంతులు వీరే..

| వ్యక్తి | సంపద (రూ.కోట్లలో) |
|---|---|
| మురళి దివీస్(దివీస్) | 76,100 |
| పీ పిచ్చిరెడ్డి(మెయిల్) | 54,800 |
| పీవీ కృష్ణా రెడ్డి(మెయిల్) | 52,700 |
| జీఎం రావు(జీఎమ్మార్) | 36,300 |
| పీవీ రాంప్రసాద్ రెడ్డి(అరబిందో) | 35,100 |
| బండి పార్థసారథి రెడ్డి(హెటిరో) | 29,900 |
| ప్రతాప్ రెడ్డి(అపోలో గ్రూపు) | 28,400 |


## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్‌రావ్

ఎదులాపురం, ఆగస్టు 29 : సెప్టెంబర్ 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్‌రావ్ అన్నారు. గురువారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌తో కక్షిదారులు ఇద్దరి గెలుపు అవుతుందన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, ప్రమీల జైన్, బీ. సౌజన్య, ఎస్.మంజుల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ



బహిరంగ లేఖ విడుదల చేస్తున్న మానవ హక్కుల వేదిక సభ్యులు

ఎదులాపురం, ఆగస్టు 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆరు హామీలతో పాటు రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని వాటిని అమలు చేయాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాంబ్లె అతిశ్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలలో ఏడవ హామీ ప్రజాస్వామ్య పునరుద్ధరణకు సంబంధించిన కరపత్రాలు విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిస్థితిలో మార్పు తీసుకొస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక సభ్యులు సూరజ్, రాహుల్, దివ్య, నిఖిత, మౌనిక, రజిత, సంధ్య, ఆర్తి తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో మహిళా సిబ్బందిని నియమించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

ఎదులాపురం, ఆగస్టు 29 : జిల్లాలో బాలికల వసతి గృహాల్లో సదుపాయాలు కల్పించాలని, మహిళా సిబ్బందిని నియమించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆదిలాబాద్ జిల్లా కమిటీ తరపున కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్‌కు కలిసిన వారిలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డాక్టర్ షాహిద్, జిల్లా కన్వీనర్ పెందుర్ మధు, జిల్లా కో కన్వీనర్ రాథోడ్ రోహిదాస్ నాయక్, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ సాంబశివరావ్, జిల్లా కమిటీ సభ్యులు సూర్యకాంత్ వాగ్మారే, పాండురంగ, పెందుర్ దత్తు, రాజ్‌దేవ్ కామ్లే పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన డీఈ కార్తిక్

ఎదులాపురం, ఆగస్టు 29 : హైదరాబాద్ జీహెచ్ఎంసీలో విధులు నిర్వహించి ఆదిలాబాద్ మున్సిపాలిటీకి బదిలీపై వచ్చిన డీఈ కార్తీక్ గురువారం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌ని శాంతినగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పలు అంశాలపై చర్చించి, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ తిరుపతి, అశోక్ స్వామి, కొండ గణేశ్, దమ్మపాల్ సంజయ్ పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం
- విద్యార్థులకు యాంటి ర్యాగింగ్, డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై అవగాహన



యాంటీ ర్యాగింగ్ టోల్ ఫ్రీ నంబర్లు, వెబ్ సైట్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం,ఆగస్టు 29: డ్రగ్స్ రహిత జిల్లాగా ఏర్పాటుకు కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గురువారం రిమ్స్ ఆడిటోరియంలో వైద్యవిద్యార్థులకు ర్యాగింగ్, డ్రగ్స్, సైబర్ క్రైమ్ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ గౌష్ ఆలం హాజరయ్యారు. ముందుగా ర్యాగింగ్, డ్రగ్స్, సైబర్ క్రైమ్ అంశాలపై డీఎస్పీలు వివరించారు. సైబర్ నేరగాళ్లు ఉపయోగిస్తున్న ఓటీపీ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, పోలీస్ డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ లాంటి అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. సైబర్ క్రైమ్‌కు గురైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 1930కు డయల్ చేయాలని సూచించారు. డ్రగ్స్ తీసుకోవడంతో కలిగి నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ... ఆదిలాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గంజాయి తాగే వారికి గుర్తించేందుకు ప్రత్యేక కిట్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాలలో ఎవరైన గంజాయి తాగినా, ర్యాగింగ్‌కు పాల్పడినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వివిధ నేరాలకు శిక్షలను వివరించారు. యాంటీ ర్యాగింగ్ టోల్ ఫ్రీ నంబర్లు, వెబ్‌సైట్‌ను వివరించారు. అనంతరం డ్రగ్స్ నివారణపై పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బీ సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, హసీబుల్లా, బీ సురేందర్ రెడ్డి, టీఎస్ న్యాబ్ టీఎస్పీ ఎం పద్మనాభం, రిమ్స్ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విద్యావిలాస్, సూపరింటెండెంట్ అశోక్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, సీఐలు బీ. సునీల్‌కుమార్, సీహెచ్ కరుణాకార్‌రావు, ఫణిందర్, ప్రణయ్‌కుమార్, ఎస్ఐ విష్ణువర్ధన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల, ఆగస్టు, 29: కుంటాల మండలానికి చెందిన 54 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడిన వారు సీఎం సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కుంటాల మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు కలిసి ఒకరికొకరు సమన్వయంతో పనిచేయాలని, విద్య, వైద్యం, ఇరిగేషన్ డ్రైనేజీ, సాగునీరు, తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, వెంకూర్ చెరువు మరమ్మతుల పనులు ఇంకా ప్రారంభించకపోవడంపై ఇరిగేషన్ అధికారిపై అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని రైతులకు వ్యవసాయ కూలీలకు ఇబ్బంది లేకుండా పంట పొలాల్లోకి వెళ్లడానికి రోడ్ల నిర్మాణానికి ఎస్టిమేషన్ తయారు చేయాలని ఏపీవో నవీన్‌ను ఆదేశించారు. రూ.4 కోట్ల వ్యయంతో చెరువుల పూడిక తీత తీసినా ఎక్కడ అలా కనిపించట్లేదని ఏపీవో పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలన్ని గ్రామాల్లోని సీడీఎఫ్ నిధుల కేటాయింపుపై ఎంపీడీవోను నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రహీం, డీటీ నరేశ్ గౌడ్, ఆయా శాఖల అధికారులు, మాజీ ఎంపీపీ గజ్జారాం, నాయకులు జీవీ రమణారావు, అశోక్, దిగంబర్ పటేల్, వెంగల్ రావు, తాటి శివ, జక్కుల గజేందర్, పసుల నవీన్, తదితరులు ఉన్నారు.

## అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఎదులాపురం, ఆగస్టు 29 : ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారులతో గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షి సమీక్షా సమావేశం నిర్వహించారు. మైక్రో క్రిడిట్ ప్లాన్, క్రాప్ లోన్ పెండింగ్, మహిళా శక్తి పథకం కింద 12 సహకారాలపై మండలాల వారీగా ఇప్పటి వరకు సాధించిన లక్ష్యాలు ఆపత్రిక వివరించారు. విద్యార్థులకు అందిస్తున్న ఏకరూప దుస్తుల స్టిచ్చింగ్ వివరాలు ప్రతి అంశంపై బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు, డీఆర్డీవో, డీపీఎం ఏపీఎంలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్ నుంచి విద్యార్థిని అదృశ్యం

ఎదులాపురం, ఆగస్టు 29 : పట్టణంలోని ద్వారక నగర్‌లోని ఓ ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఓ మైనర్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన చోటు చేసుకున్నది. బుధవారం రాత్రి ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎవరికీ చెప్పకుండా పారిపోయింది. గమనించిన ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సీసీ ఫూటేజ్ పరిశీలించగా ఇన్‌స్టిట్యూషన్ నుంచి గోడ దూకి పారిపోయినట్లు నిర్ధారించారు. తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు చేశారు. పారిపోయిన ఆ విద్యార్థి సమీప బంధువుల ఇంటికి వెళ్లింది. దీంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ఆ విద్యార్థిని ఇన్‌స్టిట్యూట్‌కు పంపించినట్లు వన్ టౌన్ సీఐ బీ.సునీల్‌కుమార్ తెలిపారు.

## యువకుడి అదృశ్యం

ఎదులాపురం, ఆగస్టు 29 : పట్టణంలోని ఖుర్షీద్ నగర్‌కు చెందిన యువకుడు సోహెల్(24) అదృశ్యమైన కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాశ్ తెలిపారు. ఈ నెల 26న ఇంటి నుంచి వెళ్లిపోయిన సోహెల్ ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల, బంధువుల ఇంటికి వెతికిన ఆచూకీ లభించలేదు. కొన్ని నెలల నుంచి మానసిక స్థితి బాగా ఉండేది కాదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## చోరీ కేసులో మరొకరి అరెస్ట్..రిమాండ్

ఎదులాపురం, ఆగస్టు 29 : ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో బుధవారం తెల్లవారుజామున జరిగిన దొంగతనంలో అదే రోజు ఉస్మాన్ అరెస్ట్ కాగా మరొకరిని గురువారం యాడే రతన్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సీఐ సిహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. ఇద్దరి చోరీ కేసులో జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలై మళ్లీ దొంగతనానికి పాల్పడ్డారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎదులాపురం, ఆగస్టు 29 : రైల్వే స్టేషన్ సమీపంలోని ఠాకూర్ హోటల్ వద్ద గురువారం ద్విచక్రవాహనంతో జరిగిన ప్రమాదంలో చిట్టి అనే మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. చిట్టి తన కూతురిని తీసుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో అటువైపు వస్తున్న ద్విచక్రవాహనదారుడు అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారకుడు అయ్యాడు.
దీంతో వాహనదారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణు ప్రకాశ్ పేర్కొన్నారు.

## నెమలి అప్పగింత

కుంటాల, ఆగస్టు, 29 : మండలంలోని కల్లూరులో ప్రతాప రెడ్డికి చెందిన చేనులో గురువారం గాయపడిన నెమలిని గమనించి తీసుకవచ్చి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఎఫ్‌బీవో సాయిరెడ్డి, ఎఫ్ఎస్‌వో అలేఖ్య రైతు ఇంటికి వచ్చి నెమలిని స్వాధీనం చేసుకున్నారు.

## ప్రయాణికులను సురక్షితంగా తరలించాలి

నార్నూర్,ఆగస్టు 29: ఆటో డ్రైవర్లు ప్రయాణికులను గమ్యస్థలానికి సురక్షితంగా తరలించాలని నార్నూర్ సీఐ రహీంపాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆటోలో ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. వాహానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. మార్కెట్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ లేకుండా సహకరించాలన్నారు. ఈ సమావేశంలో సిబ్బంది, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

## యాచకుడికి చేయూత



యాచకుడికి స్నానం చేపిస్తున్న రాథోడ్ సికిందర్

నార్నూర్, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని పక్షం రోజులుగా మతిస్థిమితం లేకుండా యాచకుడు తిరుగుతున్నారు. గురువారం పెసాచట్ట కో ఆర్డినేటర్ రాథోడి సికిందర్, గోశాల నిర్వాహకులు ఆడే రాంనివాస్ యాచకుడికి స్నానం చేయించి, గడ్డం, కటింగ్ చేయించారు. నూతన వస్త్రాలు కొనుగోలు చేసి ధరించారు. దీంతో వీరిని మండలవాసులు అభినందిస్తున్నారు. ఇక్కడ గజేందర్, రవీ, వీర్‌సింగ్ తదితరులున్నారు.

## ఖానాపూర్ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా గఫర్

ఖానాపూర్, ఆగస్టు 29: ఖానాపూర్ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఎంఏ గఫర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా నుంచి ఖానాపూర్‌కు రాగా ఇక్కడ పనిచేసిన నగేశ్‌బాబు ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ ఆయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌కు పాఠశాల సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

## సొనాలలో పిచ్చి కుక్కల స్వైర విహారం



కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు

బోథ్, ఆగస్టు 29 : మండలంలోని సొనాల గ్రామంలో గురువారం సాయంత్రం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..ముగ్గురిని గాయపర్చాయి. నానక్ సింగ్, చందర్ సింగ్‌తోపాటు మరో బాలుడిని తీవ్రంగా కరిచాయి. వీరిలో బాలుడి పరిస్థితి విషమంగా మారడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని పిచ్చి కుక్కల బెడద లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.